క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

దాచేపల్లి: మండల వ్యాప్తంగా ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రామాపురం సచివాలయంలో శ్రీనగర్, పొందుగల గ్రామాలు, అదే రోజు మధ్యాహ్నం నుంచి గామాలపాడు సచివాలయంలో గామాలపాడు గ్రామస్తులు వినియోగించుకోవాలని చెప్పారు. ఈ నెల 25న కేసానుపల్లి గ్రామ సచివాలయంలో కేసానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు గ్రామస్తులు, 26న ఉదయం మాదినపాడు గ్రామ సచివాలయంలో మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు గ్రామస్తులు, 26 సాయంత్రం భట్రుపాలెం గ్రామ సచివాలయంలో భట్రుపాలెం, కాట్రపాడు గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 27 ఉదయం ముత్యాలంపాడు గ్రామ సచివాలయంలో ముత్యాలంపాడు గ్రామస్తులు, అదే రోజు సాయంత్రం తంగెడ గ్రామ సచివాలయంలో తంగెడ గ్రామస్తులు వినియోగించుకొవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు కోరారు.

మహిళా సాధికారత కోసం కృషి



దాచేపల్లి: మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచి జంగా సురేష్ అన్నారు. మండలంలోని గామాలపాడులో మహిళా సదస్సు మంగళవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

కులవివక్షపై విచారణ



అచ్చంపేట: కులాంతర వివాహం చేసుకున్నందుకు వేధిస్తున్నారని, కులవివక్ష చూపుతున్నారంటూ మండలంలోని చెరుకుపాలెం బీసీ కాలనీకి చెందిన చెందిన కత్తుల నాగసంధ్య ఎలియాస్ పుష్పలత, కత్తుల గోపీకృష్ణరెడ్డి జాతీయ ఎస్సీ, ఎస్టీ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ కె.చంద్రశేఖర్ మంగళవారం విచారణ చేశారు. దారికి అడ్డంగా వేసిన కంచెను పీకించారు. పంచాయతీ వారు వేసిన రోడ్డును వినియోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, ఆటంక పరిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. బాధిత కుటుంబం మంచినీళ్లు వాడుకునేందుకు అవకాశం కల్పించారు. మంచినీటి కుళాయి కూడా వేయాలని పంచాయతీ కార్యదర్శి శివయ్యను ఆదేశించారు. కులవివక్షనేరమని, పాల్పడినవారు శిక్షార్హులని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో నాగేశ్వరరావు, సీపీఎం స్థానిక బాధ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

121 మందికి అన్నదానం

సత్తెనపల్లి: పట్టణంలోని మాస్టిన్‌పేటలో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ద్వారా తెలుసుకున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు దాతల సహ కారంతో మంగళవారం 121 మందికి అన్నసంతర్పణ చేశారు. అన్నం మల్లికార్జునరావు తిథి సందర్భంగా వారి పెద్ద కుమారుడు అన్నం కృష్ణమూర్తి, విజయదుర్గ అన్నసంతర్పణలో భాగస్వాములయ్యారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు




పిడుగురాళ్ల పట్టణంలోని గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న కనక దుర్గమ్మ



పట్టణంలో అన్నపూర్ణదేవిగా వాసవీ అమ్మవారు..



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు..



రెంటచింతలలో గాయత్రీ దేవిగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



సత్రశాల దేవస్థానంలో గాయత్రీ దేవి అలంకారంలో భ్రమరాంబికాదేవి

పిడుగురాళ్ల: దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద మహిళా భక్తులు దేవాలయం వద్దకు హాజరు బతుకమ్మలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని భవానీ నగర్‌లోని కనక దుర్గమ్మను గాయత్రిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వాసవీ అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను పొందారు. అదే విధంగా లక్కీ డ్రిప్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యడియం పెద్ద సత్యనారాయణ, అమరా చంద్రశేఖర్, కొత్తూరు సురేష్, మద్దాలి సుధాకర్, కట్టమూరి ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు

రెంటచింతల: దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో అమ్మవార్ల దేవాలయాలు వేకువజామునుంచే భక్తులతో కిక్కిరిసి పోయాయి. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు, సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో భ్రమరాంబిక అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు.

పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో దుర్గాదేవి అమ్మవారు పార్వతీ దేవి, సరస్వతిదేవి అమ్మవారు గౌరీ దేవి, లక్ష్మీదేవి అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలవికాస్ హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారు దేవస్థానంలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్లును ప్రత్యేకంగా అలంకరించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వర రావు, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు యేచూరి సాంబశివ రావు, కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.



పిడుగురాళ్లలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బతుకమ్మతో మహిళలు



పట్టణంలోని మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు..

రైతులు మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి



దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లెలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మంగళవారం పొలాలను ఏఓ అమీర్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న వేసే ప్రతి రైతు తప్పనిసరిగా కంపెనీ నుంచి బాండ్ తీసుకోవాలన్నారు. మండలంలోని కౌలు వేసే కౌలు రైతులు అందరూ మీ సంబంధిత ఆర్‌ఎస్‌కేను సంప్రదించి కౌలు రైతు కార్డు పొందాలన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



పిడుగురాళ్ల: జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమాదేవి అన్నారు. పట్టణంలోని పాతగణేశునిపాడులో వైద్య సిబ్బంది మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో రెండు జ్వరాల కేసులు గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సి.జానీమీరా పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం..



వైద్యులకు సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర

వెల్దుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలలో చెత్తా, చెదారం పేరుకుపోయి జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యులు అప్రమత్తంగా ఉండి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర అన్నారు. మంగళవారం ఉప్పలపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో మురుగు కాల్వలలో మురుగు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. దోమ తెరలు వాడటం వలన దోమల బారి నుంచి బయట పడవచ్చునన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి జ్వరాల బారిన పడిన వారి రక్త నమూనాలు సేకరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యోగేశ్వరి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

గోగులపాడులో 'మహా పోషణ్'



తినుబండారాలను పరిశీలిస్తున్న సీడీపీఓ కాంతకుమారి, డాక్టర్ సాయిబాబా

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మహా పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ ఎన్.కాంత కుమారి హాజరయ్యారు. అంగన్‌వాడీలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సాయిబాబా పాల్గొని చిన్న పిల్లల ఆరోగ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. మంచి వంటకాలకు బహుమతులు అందజేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బొల్లాపల్లి: మండలంలోని మేళ్ల వాగు అంగన్‌వాడీ మెయిన్ సెంటర్ వద్ద పోషణ్ మహా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్ట్ సీడీపీఓ ఇ.వాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందజేస్తున్న ఆహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంటల ప్రదర్శన, బాలామృతం ప్రాధాన్యత, డీఐవై బొమ్మల తయారీ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ మస్తాన్ బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు బాలింతలు, కిశోర బాలికలు చిన్నారులు పాల్గొన్నారు.

కార్మికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సత్రశాల(రెంటచింతల): కర్మాగారాలలో(పరిశ్రమలు) విధులు నిర్వహించే సమయాల్లో కార్మికులు, ఉద్యోగులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీం ఎస్ఐ రాజీవ్ అన్నారు. మంగళవారం మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పరాశక్తి సిమెంట్ కర్మాగారం ఆవరణలో కార్మికుల కు, ఉద్యోగులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడం వలన శారీరక, మానసికంగా కలిగే సమస్యలను వివరించారు. మత్తు పదార్థాలను వాడిన, కొనుగోలు చేసిన, రవాణా చేసిన చట్ట ప్రకారం శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం కార్మికులు, ఉద్యోగులతో డ్రగ్స్ వద్దు బ్రో అని ప్రమాణం చేయించారు. సమావేశంలో పరాశక్తి సిమెంట్ కర్మాగారం ఏజీఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్వహణకు బహిరంగ వేలం

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలోని కల్యాణమండపం నిర్వహణకు బహిరంగ వేలం పాట ఈనెల 2వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బండి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మండపంలో జరిగే ఫంక్షన్‌లకు ఎలక్ట్రికల్ డెకరేషన్, పూల డెకరేషన్ ఏర్పాటు చేసేందుకు ఫంక్షన్లకు వంటపాత్రలు, షామియానాలు, కుర్చీలు తదితర వస్తువులు అద్దెకు ఇచ్చే హక్కు కోసం వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు. హక్కుపొందిన వారికి 1అక్టోబర్ 2025 నుంచి 30 సెప్టెంబర్ 2026 వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. రెండు విభాగాలకు విడివిడిగా ధరావత్తు రూ.25వేలు చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు.

నకరికల్లు ఎస్ఐగా సతీష్

నకరికల్లు: ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎస్ఐ కె.సతీష్ అన్నారు. నకరికల్లు ఎస్ఐగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ కె.సతీష్‌ను, నకరికల్లు నుంచి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ చల్లా సురేష్‌ను సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్.ఎన్.నారాయణ షేక్ సుభాని, డి.చెన్నకేశవులు, జానయ్య, రమేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు అరుణ సేవలు ఆదర్శనీయం



అరుణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మాచర్ల: సామాజిక సేవ కార్యక్రమంలో ఉత్తమంగా నిలిచిన ఉపాధ్యాయురాలు మల్లిపెద్ది అరుణను స్ఫూర్తిగా తీసుకోవాలని డాక్టర్ కొండవీటి రామకోటయ్య పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో 39 సంవత్సరాలుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మల్లిపెద్ది అరుణ పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి రామకోటయ్య మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండి విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు దేవన బోయిన జ్యోతి, అల్లి సురేష్ మాట్లాడుతూ ఆదర్శ భావాలు గల ఉపాధ్యాయునిగా విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ప్రధానోపాధ్యాయిని సిస్టర్ థామస్ కొనియాడారు. కోనేరు శంకరరావు, అరుణ దంపతులతో పాఠశాల అభివృద్ధిలో భాగంగా, సొంత నిధులతో సుమారు రెండు లక్షల విలువ చేసే ఒక కళామండపాన్ని నిర్మించి పాఠశాలకు అందించారన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయురాలు మల్లిపెద్ది అరుణ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణు బాబు, ఎన్నారై విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రణభేరి సభను విజయవంతం చేయాలి



యూటీఎఫ్ కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న రణభేరి సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సెప్టెంబర్ 25న నిర్వహించనున్న రణభేరి వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌కే ఖాశీం పీరా, పల్నాడు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్ ఎడిటర్ కె.రవి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే జమాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ సాంబశివరావు, జి. ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో అట్టహాసంగా టెక్ టుడే



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం టెక్ టుడేను అట్టహాసంగా నిర్వహించారు. కళాశాల ఈసీఈ విభాగం, ఐఈటీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్ టుడ్ -25 కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ విభాగాల నుంచి 243మంది విద్యార్థులు వివిధ ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో ఆన్‌ఐటీ, పేపర్ ప్రెజెంటేషన్, సర్క్యూట్ కార్నివాల్ వంటి టెక్నికల్ ఈవెంట్స్‌తో పాటు ఈ-స్పోర్ట్స్ వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ప్రొఫెషనల్ సొసైటి సభ్యుడిగా ఉండటం ద్వారా అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. ఐఈటీఈ చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, ఐఈటీఈ కో-ఆర్డినేటర్ ఎ.రాధ, ఐఈటీఈ స్టూడెంట్ వైస్‌చైర్మన్ లలిత, కార్యదర్శి అను తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చింతే

- వాన పడితే ఆ కాలనీలకు కష్టాలే
- ముంపునకు గురవుతున్న నాగన్నకుంట, సుందరయ్యకాలనీ, వెంకటపతినగర్, యానాది కాలనీ, మాస్టిన్‌పేట
- ఆక్రమణలకు గురైన వడ్డవల్లి ఎద్దువాగు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సత్తెనపల్లి: చినుకు పడితే సత్తెనపల్లి వాసులకు చింతే. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. వర్షం పడితే నీటితోపాటు డ్రెయినేజీ నీరు ఏకమై రోడ్లపై పారుతున్నాయి. దీంతో ప్రధానవీధులు తటాకాల్లా కనిపిస్తున్నాయి. మురుగు కాలువలను ఆక్రమించి దుకాణాలు, బండలు వేస్తున్నా మున్సిపల్ అధికారుల చర్యలు కానరావడం లేదు. పూడికలు తీయలేని పరిస్థితి ఎదురవుతోంది. వర్షం పడితే పట్టణంలోని నాగన్నకుంట, సుందరయ్యకాలనీ, వెంకటపతినగర్, యానాదికాలనీ, మాస్టిన్‌పేట పూర్తిగా నీట మునుగుతున్నాయి. వీటికి తోడు శాలివాహననగర్, దోబీఘాట్ సమీపంలో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆక్రమణల బారిన

వడ్డవల్లి ఎద్దువాగు నుంచి నరసరావుపేట రోడ్డు దాటి మాచర్ల రోడ్డులోకి వర్షం నీరు వెళ్లాలి. వడ్డవల్లి ఎద్దువాగు అడుగడుగునా ఆక్రమణలకు గురి కావడంతో వాన నీటి ప్రవాహానికి అడ్డంకి మారి ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. ఇది ఇలా ఉంటే మాచర్ల రోడ్డులో రహదారి పక్కన అధికార పార్టీకి చెందిన సానుభూతిపరుడు ఇళ్ల స్థలాల వెంచర్ వేశాడు. అక్కడకు వెళ్లేందుకు నరసరావుపేట రోడ్డు దాటాక 20 అడుగుల కాలువను కుచించుకుపోయేలా చేశారు. వర్షం వస్తే నీరు వెళ్లే దారిలో కాలనీలు జలమయమవుతున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఈ ఐదు కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ప్రజాప్రతినిధులకు ఓట్ల సమయంలోనే మేం గుర్తుకొస్తాం.. మా కష్టాలు పట్టవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ పటిష్ట పరచాలని వారు కోరుతున్నారు.



ఆక్రమణలకు గురైన వడ్డవల్లి ఎద్దువాగు

ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు



కాలువను ఆక్రమించి వెంచర్ వేయడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నాగన్నకుంటతో పాటు పలు కాలనీలు మునిగి పోతున్నాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. 20 అడుగుల వెడల్పు కలిగిన కాలువను పూర్తిగా తగ్గించి కేవలం మూడు గోనెలు వేయడంతో వర్షం నీరు, మురుగు పారుదల లేక కాలనీల్లో నీరు చేరుతోంది.

–షేక్ నాగుల్‌బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు, సత్తెనపల్లి

ఎద్దువాగు ఆక్రమణలు తొలగించాలి



పట్టణంలోని వడ్డవల్లి శివారులోని శాలివాహన నగర్, సుందరయ్య కాలనీ, నాగన్న కుంట, వెంకటపతి కాలనీ పక్కగా వెళ్లే ఎద్దువాగు ఆక్రమణకు గురైంది. దీంతో పట్టణంలోని వివిధకాలనీలు ఎద్దువాగు ఉధృతికి ముంపునకు గురవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఎద్దువాగు ఆక్రమణలను పూర్తిగా తొలగించి పూడికను తీయించాలి. లేకపోతే కాలనీ బాధితులతో కలిసి పోరాటం చేస్తాం.

–వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, సీపీఐ కార్యదర్శి, సత్తెనపల్లి

మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరం



నకరికల్లు: మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరమవుతాయని లింక్‌వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్‌వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, మాదకద్రవ్యాలు అరికట్టడంపై అవగాహన సదస్సును మండలంలోని నర్సింగపాడులో మంగళవారం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. హెచ్ఐవీ బాధితులతో ప్రేమగా ఉండాలని, వారిని దూరం పెట్టకూడదన్నారు. మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడం, ఎయిడ్స్ వ్యాధి అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నకరికల్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలైన వారు వాటిని వీడే వరకు అండగా ఉండాలన్నారు. హెచ్ఐవీ, క్షయ, సుఖవ్యాధులకు ఉచిత మందుల కోసం 1097లోసంప్రదించాలన్నారు. సర్పంచ్ సంగు రామకోటమ్మ, లింక్‌వర్కర్ దయామణి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.